# మెర్సీ కిల్లింగ్

- ఆంధ్రప్రభ, 2002

బ్రతుకు భారమై చావుకొరకు ఎదురుచూసే వాళ్ళని
బ్రతకమని శాసించడం...
అమానుషత్వం.
హత్య చేయకపోవడమే పాపం.

---

"గమ్మునుండమ్మే, చెప్పొచ్చావుగానే, ఆ ముసల్దాన్ని హాస్పిటల్లో చేర్పిస్తే ఎంతవుద్దనుకుంటా వుండావు నువ్వా?" చేటలో వున్న బియ్యాన్ని గిన్నెలో పోస్తూ అంది జయమ్మ, అరగంటనుండీ తనకు హితబోధలు చేస్తున్న స్నేహితురాలు సునీతతో.

సునీత స్టూలుమీదనుండి లేచి స్టౌమీద ఎసరులో బియ్యం పోస్తున్న జయమ్మ దగ్గరకొచ్చింది.

"చూడూ, డబ్బు సంపాయించుకుంటే వస్తది... మనిషి పోతే, మళ్ళా వస్తాదా చెప్పా!"

"నీ అమ్మబడవా!! నాకాడేదుండది డబ్బే? సంపాయించేదానికి మొగుడా, మొద్దులా? నాకు డబ్బు యాడనుంచొస్తది? పిల్లది కొంపలంటుకున్నట్టు ఈడేరె! ఏదో పదో పరకో నేను కూడబెడ్తే దానికి మనువొస్తే కావద్దా అదే...?" జయమ్మ నిస్సహాయతతో కూడిన నిట్టూర్పు వదులుతూ అంది.

సునీత మాట్లాడలేదు.

మరలా జయమ్మే అంది "అమేయ్! నువ్వే చెప్పు, ఎద్దుల్లాంటి కొడుకులున్నారు. అమ్మ ఆళ్ళ కట్నం కోసరం చెడ్డదవలా? అళ్ళ కామాత్తరం గేనం వుండబల్లే! ఉసిక్కిమంటే

నా దగ్గరికి మనిషినంపుతారు. ఇదేవన్నానేయంగా వుండాదేం? ఈడ నేనేందో అమాయన్నే కూటికుండ మూటకట్టేసినట్టు!"

"అకాడికి నువ్వు చెప్పేది కరకట్టేగానీ, తల్లిని అట్టా సూత్తా సూత్తా యాడూరు కుంటావు నువ్వు మటుక్కి. ఓ ఎయ్యి రూపాయలు ఎట్టి మీ యమ్మని ఆడికీడికి తిరిగేటట్టు చెయ్యే, పాపం!"

"ఒక్కదాన్ని నా కట్టాలేవో నేను పడ్తావుంటే మద్దిలో నీ నాయం ఏందే? నీగ్గోడా ఈడుకొచ్చిన కూతురుంటే గదా తెలిసేది? నీకేవమ్మా.... ఇద్దరు మొగ పిల్ల కాయలాయె యావైనా చెప్తావు!"

పాపం, జయమ్మకి తల్లికి అలా వుంటే బాధగానే ఉంది. కానీ తల్లిని చూడాల్సిన కొడుకులుండగా, తనెందుకు చూడాలని దుగ్ధ.

సునీత నవ్వేసింది. సునీతది కాస్త సాధుస్వభావం, జాలిగుండె. జయమ్మలో లౌకిక జ్ఞానం ఒకపాలు హెచ్చు. అయినా వాళ్ళ బాల్యస్నేహం పచ్చగానే వుంది. అంత వరకూ దానికి కారణం సునీతే అని చెప్పొచ్చు. సర్దుబాటు మనస్తత్వం సునీతది.

"పోన్లే, ఇంకేదన్నా చెప్పు, రెండోవోడు ఏం చదూతుండాడు?"

"ఆడా? ఆడు సతకతా వుండాడ్లేమే. ఆరో కలాసు. యాడన్నా కూలికి పోరా అంటే ఇనకపాయె. పోనీ, అమాయన్నే సదువొత్తాదా అంటే అదీ లేదు. ఈ నా ఒక్కదాని రెక్కలకట్టంమీన ఈళ్ళనందర్నీ సూడాలంటే కట్టంగా వుండాదే ఈ నెల్లూరులో ధరలు మండిపోతావుండె!"

వీళ్ళిద్దరూ ఘర్షణ పడుతున్నది జయమ్మ తల్లి రాజమ్మ గురించి.... ఆమెకు డెబ్బై ఏళ్ళు. ఈ మధ్యనే కుడికాలు, కుడిచెయ్యి పక్షవాతం వచ్చి పనిచెయ్యటం లేదు. ఎడమ చెయ్యి ఆమెకు పుట్టుకతోనే లేదు. చిన్న పేగుల్లో క్యాన్సర్ ముదిరిపోయింది. డాక్టర్స్ ఆమె ఎంతోకాలం బతకదన్నారు. ఇంతకాలం అందరికీ అన్నీ చేస్తున్న ఆమె హఠాత్తుగా పడకలో పడిపోయి అందరికీ భారమైంది.

సునీత మాట్లాడలేదు. జయమ్మే మరలా అంది.

"సరేలే, నువ్వేదో నన్ను చూడాలని వత్తే, నా కట్టాలన్నీ నీకాడ సదవతాండ! అవునూ, ఏందే సునీతా, నీ కొడుకు పేమించి పెళ్ళిసేసుకున్నాడంట! ఆడెవరో చెప్పుకుంటా వుంటే ఇన్నాలే నిజమేనా? నాకు సెప్పనేలేదే నువ్వు?"

తలవంచుకుంది సునీత. 'నిజమే' అన్నట్టుగా తలవూపి నిట్టూర్చింది. "ఏడా? జరిగి పది దినాలే కదా! నీ కాడికి ఇదేగా వస్తావుండాను!"

"నువ్వెట్టాగొప్పుకున్నావే?" జయమ్మ బుగ్గలు నొక్కుకుంది.

"ఏం చేయాలో చెప్పు, కడుపు చించుకుంటే కాళ్ళమీద పడద్ది! అడి పెళ్ళిలో నాలుగు కట్నంరాళ్ళు వత్తే అప్పులు తీరుద్దామనుకున్నాను. ఈడిట్టా చేసే..." మరలా నిట్టూర్చింది సునీత.

"మరే... నువ్వు మాత్తరం అడి సదూకేనాయె అప్పులు సేసింది!" ఎలా ఓదార్చాలో తెలియక జయమ్మ... తనని అన్యాయం చేసిన కొడుకుగురించి ఆలోచిస్తూ సునీత ఇద్దరికిద్దరూ నిశ్శబ్దంగా ఉండిపోయారు కాసేపు.

"ఆఁ, అడికేవేఁ, నన్ను అప్పులు పాలుజేసే... ఆడేదో ఉజ్జోగానికని పాయె. నన్నీడ అప్పులాళ్ళు ఊపిరాడనీకపోతిరి! జయమ్మో! ఈ సంగతిను, మల్లా ఉజ్జోగం రాలేదని తిండికని వంద రూపాయలు అంపమని ఉత్తరం ఏస్సాడు!" జయమ్మ ఏరుతున్న ఆకుకూరలో సగం తీసుకుని కాడలు తుంచి పడేస్తూ దిగులుగా అంది సునీత.

జయమ్మ వేళ్ళ చలనం ఆగింది. ఆశ్చర్యంగా చూసింది.

"జాబేసాడా? నువ్వాడబ్బులు పంపేసావా ఏంది?"

"భల్దానివే పంపక చస్తానా? తిండికి లేదని రాసె. కడుపులో పేగులు దేవి నట్టయ్యా... నా పాట్లేదో నేను పడ్డా. ఆ వందా అంపితేగానీ నా మనసు కుదుటపల్లా!"

"అదంతే!" అని జయమ్మ కూడా నిట్టూర్చి ఆకుకూర సునీత దగ్గరనుండి అందుకుని స్టౌ దగ్గరకెళ్ళింది.

'అసలు ఏమిటీ సృష్టి? తను కన్నబిడ్డ కన్నీళ్ళు పెడితే కరిగిపోయె మనం తల్లి పేగు తెంచుకుని, ఆమె ప్రేమ పంచుకుని, ఆమె త్యాగాలతో పెరిగి పెద్దయిన మనం ఆ తల్లి కన్నీటికి, కష్టాలకు ఎందుకు కరిగిపోవడం లేదు?'

'ఎవరైనా నీ ప్రాణం ఇస్తావా? నీ బిడ్డ ప్రాణం తీసుకోమంటావా?' అని అడిగితే నా ప్రాణమే తీసుకో అని నిజాయితీగా ముందుకొచ్చే తల్లి... ఆ తల్లి ప్రాణం కోసం కొద్ది డబ్బుకూడా ఖర్చుపెట్టడానికి ముందుకు రాని బిడ్డ.... ఎక్కడుంది ఈ లోపం?

'తల్లి మనసు వెన్న, బిడ్డ మనసు రాయి' అనే సూక్తి నిజమా? లేక తల్లిని నిర్దయగా, ఒంటరిగా, ఎలాంటి వైద్య సహాయం అందించకుండా వదిలేసినా ఈ సమాజం అంతగా బిడ్డల్ని పట్టించుకోకపోవడంవల్లనా ఇలా జరుగుతోంది? తల్లినీ, గోవునీ పూజించమని చెప్పే భారతీయ సంస్కృతి ఏం చేస్తోంది? కనీసం పాశ్చాత్యుల్లా వోల్డేజ్ హోమ్స్ అయినా నిర్వహిస్తోందా అంటే అదీ లేదు!

కూర స్టౌమీద పెట్టి తిరిగొచ్చి యేడుస్తున్న స్నేహితురాలి కన్నీళ్ళు తుడిచింది జయమ్మ.

"ఏందో.. చాలీ సాలని బతుకులు! మనవిట్టా తెల్లారిపోవాల్సిందే! సూడూ...." బయట తలుపు చప్పుడైతే ఇంకా యేదో చెప్పబోతున్న జయమ్మ అటు తిరిగింది.

"ఎవరాడా?" గట్టిగా కేకేసింది.

"ఆమే, జయమ్మా! నేనే! ఐరావతిని. మూటలబ్బయ్య వొచ్చేడు. నువ్వా ఓ చీర తీసుకుంటావేమోననీ ఇటొచ్చా!" అంది వీధి తలుపు తోసుకుంటూ వచ్చిన పక్కింటి ఐరావతి.

"దా, దా! ఈడ కూకో!" స్టూలు లాగింది జయమ్మ.

"ఏం కోకలు తెచ్చాడేంది? మొన్న తెచ్చిన కోకల్లో పూతలు అస్సయంగా వుండాయి. అయినా నాకాడ డబ్బు లేడయి? నా ఉబలాట్టం కాకపోతే!" ఓ చీర కొనాలనే కోరికని తన దగ్గర డబ్బులు లేని సత్యం సమాధి చేస్తుంటే ఓర్చుకోలేని భావం ఆమె మాటల్లో వుంది.

"ఏందమ్మో నువ్వో... ఆకాడికి అంతా ఇస్తామా ఏంది? తెలీనట్టడగుతావే? వారం వారం వొచ్చిపోతుల్నా.... ఆడు లేడూ... రంగయ్యసామి... ఆడొచ్చాడు. ఈసారి కట్టకపోయినా అడగడులే. తీసుకోపోయే నీ కిట్టమైన పాచిరంగు కోక తెచ్చేడు!"

జయమ్మలో మరలా కోరిక. ఆమె మనసు చీరల మూట దగ్గరకెళ్ళిపోయింది. కాళ్ళు మాత్రం కదలనంటున్నాయి.

"దా, గబాన దా! ఆడు ఎల్తాడు మల్లా!" అని, "నువ్వా ఓ కోక తీసుకో. మంచియ్యి తెచ్చేడు ఈ తడవ!" సునీతవైపు తిరుగుతూ అన్నది ఐరావతి.

మనలో ఇలాంటివాళ్ళు చాలామంది వుంటారు. వాళ్ళ మెదడు చాలా పదునుగా వుంటుంది. ఇలా అందరిచేత చీరలు కొనిపించి, 'నేను లేకపోతే నీకు వ్యాపారమే లేదన్నంత' భ్రాంతిలో వ్యాపారస్తుల్ని తోసి, తాము అన్నీ చీప్‌గా కొట్టేస్తుంటారు. ఒక్కోసారి ఫ్రీ గిఫ్ట్ కూడా వాళ్ళ దగ్గరనుండి అందుకుంటుంటారు. అలాంటి వాళ్ళల్లో ఐరావతి ఒకటి.

సునీత నిట్టూర్చింది. "ఆఁ, సంబడం! చీరలు కూడానా నా బతుక్కి!"

"ఉండుండు పొయ్యిమీద కూర వుడకతా వుంది, దించేసొస్తా!"

"నే నీడుంటా, ఉడికినపాట దింపేసొస్తా, బిన్నా పోండమ్మో! మల్లా పోతాడాడు!" అన్నది ఐరావతి.

"అయితే, రవ్వంత సూస్తాండు!" అని, "దా, సునీతా! పెద్దమ్మికి ఒక సీర

కొనిపెడ్తా!... ఎదిగొచ్చినాది కదా... పెళ్ళికుంటాది. నాకు తప్పద్దా?" తనకు చీర కొనడం ఇష్టం లేదన్న భావాన్ని వెల్లడిస్తూ కదిలింది జయమ్మ.

అదో ఆత్మవంచన!

"ఆ చీరకు పెట్టే డబ్బులు మీ అమ్మకంపరాదా, జయమ్మా! పాపం...." అని అనకుండా వుండలేకపోయింది సునీత.

దాన్ని విననట్టే నటించింది జయమ్మ.

* * * * *

స్నేహితురాలు సునీత వెళ్ళిపోయింది.

ఉన్నట్టుండి జయమ్మలో ఓ పశ్చాత్తాప భావం.... 'పాపం అమ్మ.... అమ్మకు తనేం చేసింది?' అని ఐదు నిముషాలు దిగులుపడి, 'చీరకొన్న ఈ రెండొందల రూపాయలు అమ్మ వైద్దేనికేం సరిపోతయిలే!' అని సరిపెట్టుకుంది. కానీ ఆమె మనసు వూరుకోవటం లేదు. పోనీ, అమ్మనొకసారి చూసొస్తే బాగుణ్ణు!... పెట్టెలో నుండి ఓ చీర మడత విప్పేంతలో పిల్లలు స్కూలునుండి రానే వచ్చారు.

పాపం, పిల్లలకు ఆకలవుతోందో ఏమో... అన్నాలు పెట్టేసి పోతే పోలా! అనుకుంది జయమ్మ. అక్కడా తల్లి మనసే గెలిచింది బిడ్డ మనసు ఓడిపోయింది.

* * * * *

"అమ్మా!" మూల గదిలో అస్తవ్యస్తంగా కుక్కి మంచంలో కడుపు పట్టుకుని మూలుగుతున్న తల్లిని చూడగానే జయమ్మ మనసు గిలగిలలాడిపోయింది.

'మాయమ్మకు ఎలాగన్నా నయం చేయించాల!' అని అనుకుంది. ఆమెకు తల్లిమీద ప్రేమ వుంది కానీ, తల్లి మీదకంటే డబ్బుమీద ఇంకా ఎక్కువ ప్రేమ వుంది. అందుకే అన్నలు డబ్బుపెట్టి అమ్మకు నయం చేయిస్తే బాగుణ్ణని ఆమె కోరిక.

"అమో! ఎట్టుండావే?"

"నేను బాగానే వుండాలే? పిలకాయలెట్టాగుండారు? అబ్బయ్య బాగా సదూ కుంటుండాడా?"

"అళ్ళ సంగతేం గానీ, నీకెట్టుందో సెప్పు!"

"పానం ఏవీఁ బాగానేదు జయమ్మా! ఆ దేవుడెప్పుడు తీసకపోతాడా అని ఎదురు సూత్తా వుండా!" అంది రాజమ్మ.

"అట్టనబాకమ్మా!" అని కన్నీళ్ళు పెట్టుకుంది జయమ్మ.

"ఏడవబాక! ఈ రోజో, రేపో మాపో పోయేదాన్నే గదా! ఇప్పుడే పోతే పోలా అని... ఒకనాటి బాధలు కాదియ్యి! అన్నిటికీ అళ్ళమీద ఆధారపడాల ఉమ్మాయాలన్నా ఆళ్ళు రావాల, ఒంటికి పోవాలన్నా పాపం, సుమతి రావాల" నిట్టూర్చిందామె దిగులు పడుతూ.

తల్లి దగ్గరగా జరిగి, "ఏడమ్మా నొప్పి?" అని పొట్టంతా తడిమింది జయమ్మ.

"యాడని సెప్పేది.... పొట్టంతా! నరాల్లో కదిలే శక్తి లేకపాయె! ఎనక ఈపుకి పుండు పడిపాయె!" అంది రాజమ్మ.

"ఉండు, ఆన్నోళ్ళతో మాటాడొస్తా!" అంది జయమ్మ చలించిపోతూ.

"వొద్దుద్దు! ఈ రోగానికి మందులు ఇప్పియ్యాలంటే ఆళ్ళ సంపాదన సాల్దు, పాపం! అపాయిట తిండిగింజలకు అల్లాడతారు!"

"ఏం, పెద్దన్నకు జబ్బు చేస్తే నీ నగలన్నిట్నీ అమ్మి నువ్వు నయం చేయించుళ్ళా? ఇప్పుడాడి పెళ్ళాం నగలమ్మి పెట్టాడులే ఏం?" విసురుగా అంది జయమ్మ.

"అప్పుడెపుడో నగలమ్మి జబ్బు నయం సేయించానని ఇప్పుడాడిని సంపుకు తినేదా? తగ్గే రోగం అయితే సరే!" అని నీరసంగా నవ్వింది రాజమ్మ.

"నీయన్నీ చాదస్తాలు! వుండు, నన్ను అన్నతో మాటాడి రానీ!" అని తల్లి గుప్పెట్లో వున్న తనచెయ్యి లాక్కుని లోపలికెళ్ళింది జయమ్మ.

పెద్దన్న తులసికోట దగ్గర కూర్చుని పిల్లలకి కథలు చెపుతున్నాడు. అతనికి కాఫీ తెస్తున్న అతని భార్య సుమతి ముందుగా జయమ్మను పలకరించింది "ఏందమ్మో ఆడబిడ్డా! అత్తమ్మను సూడటానిక్కూడా తీరిక లేదేటి?"

"ఊరికే వచ్చేం లాభం వొదినా, అమ్మకి వైద్దిగం సేయిద్దామంటే నా చేతిలో చిల్లి గవ్వ లేకపాయె! మీరేవైనా ఇప్పుడు మందులిప్పిస్తుంట్రా?" తెలివిగా అడిగింది జయమ్మ.

"ఆ సంగతులు నాకేడ తెలస్తయి. నీ యన్ననే అడుగు! ఈ లోపల నీకు కాఫీ తెస్తా!" అని ఆమె కూడా తెలివిగా లోపలికెళ్ళింది.

గోపాలానికి మాత్రం ఇక్కడ చిక్కొచ్చిపడ్డది.

'చెల్లెలు నోటి దురుసుది. తన తల్లికి ట్రీట్‌మెంట్ ఇప్పించకపోవడం తప్పే! కానీ తనకాడ డబ్బెక్కడిదీ? ఏదో ఆ నాలుగెకరాల మీదొచ్చేది పిలకాయల చదూకు

సరిపోతాండె. ఒక్క పక్షవాతమయితే తలతాకట్టు పెట్టి ఎట్లో చేసుణ్ను. మద్దెలో క్యాన్సర్ ఒకటాయె! ఎటూ బతకదు. అట్టాటప్పుడు ఖర్చు పెట్టడం వుర్దా కదా!'

"ఏం, అన్నా! గమ్ముగుండావు... అమ్మను మదరాసుకు తీసుకపోవా?" అన్న పక్కనే కూర్చుంటూ సామ్యంగానే అడిగింది జయమ్మ. కాదంటే కదా తగువేయాలి?

గోపాలానికి చెల్లెలితో మాట పడేది ఇష్టం లేదు. అందుకే తగువుదాకా రానీకుండా తనూ తెలివిగా అన్నాడు "డబ్బులు సక్కచేస్తా వుండా... రేపో ఎల్లుండో తీసకపోవాల!"

* * * * *

రెండుసార్లు పిలిస్తేగానీ రాజమ్మ కళ్ళు తెరవలేదు. ఆమె కాలం సగం నిద్రలోనే సరిపోతోంది. నిజం చెప్పాలంటే ఆమె బాధను కడుపున బుట్టిన బిడ్డలు తీర్చడం లేదు. ఆ నిద్రే ఆమెకు ఆదరణ, ఆ నిద్రే ఆమెకు నివారణ, ఆ నిద్రే ఆమెకు సర్వస్వం. నిద్రమాత్రలు ఇస్తూ కొడుకులు ఆమెకు మంచిపనే చేస్తున్నారు.

"అమో! నేను అన్నతో మాట్టాడేను. నిన్ను రేపు తీసకపోతారంట! నువ్వు దిగులు పెట్టుకోబాక. నీకు నయం అయిపోద్దిలే! అమాయన నిన్ను నాకాడకు తీసుకుపోతాను. నెల రోజులు నా దగ్గర పెట్టుకుని అంపిస్తాను!"

ప్రేమ, స్వార్థం, తెలివితేటలు మిళితమైన తన కూతురి మాటలు విని నవ్వు కుంది రాజమ్మ. ఆమెకు తెలుసు తల్లి ప్రాణంకంటె డబ్బుకే విలువెక్కువని... తన కొడుకు తనని ఎక్కడికీ తీసుకెళ్ళడనీ... తన భర్త కట్టిన ఈ ఇంట్లో ఆఖరి శ్వాస తీసుకునే అదృష్టం మాత్రం కలిగిస్తాడనీ ఆమెకు బాగా తెలుసు.

"నీకు నేనేమి ఖర్చుపెట్టలేకపోతున్నానమా! ఆయనైనా బతికుంటే అదో తీరు!" అని తల్లి సానుభూతికోసం చూసింది జయమ్మ.

"అవును, నువ్వేం సెయ్యగలవులే పాపం! నీ సంసారమే నీకు బరువు!" మనస్ఫూర్తిగానే అంది రాజమ్మ.

ఇంకేమీ మాట్లాడటానికి మాటలు రాలేదు జయమ్మకు.

రాజమ్మ నోరు తెరిచింది. "అమేయ్! పెద్ద ఖర్చు లేని సాయం అడుగుతాను, నా కోసరం సేస్తావా!"

"ఏందదీ, సెప్పు, చేస్తాను!" ఖర్చులేని సహాయం అనే మాటతో ధైర్యం తెచ్చుకుని అంది జయమ్మ.

"నాకింత విషం తెచ్చియ్యవే!"

దిమ్మెరపోయింది జయమ్మ. "విషమా? ఎందుకు?"

"ఎందుకేమిటే పిచ్చిదానా! చావటానికి!"

"చావటానికా? ఎందుకు?" ఆ ప్రశ్న జయమ్మకే పిచ్చి ప్రశ్నలా అనిపించి, "ఏందమ్మా! నీకు మేమంతా లేమా?" అంది.

రాజమ్మ చలించలేదు. "పిచ్చిమొహమా! మీరందరూ నాకు లేరన్నానా? కాకపోతే, ఇంతలేసి బాధలుపడ్తూ పెతి చిన్నపనికి మిమ్మల్ని పాట్లు పెడ్తూ నేను బతికి బట్ట కట్టాలంటావా?"

"అదేం మాటలే! నిన్ను మేవంతా బెతికించుకుంటాం!" గుండె గోడలు దాటి వచ్చిందా మాట జయమ్మ నోటివెంట.

అప్పుడే నిమ్మరసం గ్లాసు పట్టుకుని అత్త దగ్గరకు వస్తున్న సుమతి "విషం కావాలని అడిగిందా అత్త నిన్నా?" అని నవ్వింది.

"ఆఁ....!" కన్నీళ్ళు తుడుచుకుంది జయమ్మ.

"ఎవురొచ్చినా ఇదే మాట! చూస్తా చూస్తా ఎవున్నైనా... ఎవురినైనా చంపగలరా జయమ్మా!"

జయమ్మ మాట్లాడలేదు. అప్పుడే తల్లి చనిపోయినంత దిగులుగా కూర్చుంది.

"ఛనం ఛనం బాదలు బరించలేని నేను, నాలుగు బొట్లు విషం తాగి సుఖపడా లనుకోవడం తప్పెట్టా అవుద్ది"

"ఇదీ వరస జయమ్మా! మీ అన్న అంటావుంటాడ్లే... ఇట్టా బాధలు పడే ముసలాళ్ళను చంపేయడం అమెరికాలో వుండేదంట... వాళ్ళే దాన్ని తప్పని తీసేస్తే మరి, మనం మరలా దాన్నే కావాలనుకోటం తప్పు కదా!" సుమతికి తన అత్త ఎప్పుడెప్పుడు చచ్చిపోతదా? అని వుంది కానీ తన చేతులతో తన అత్తని చంపలేని మనసు కూడా ఆమెకుంది.

"ఇట్టంటది సుమతి!... అపాయిట్నే బతికే పనైతే సరే. మరో నెల్లో సత్తానని డాకటేరు చెప్పే. నేనిట్టా బాదలు పడ్తంటే మీకు సంతోషంగా వుందా?" నిస్సహాయతలో నుండి పుట్టిన నిష్ఠూరమది.

కోడలు, కూతురూ మాట్లాడలేదు.

నిజం ఒప్పుకోవాలంటే, ఇక బతకను అని తెలిసిపోయిన వ్యక్తి బాధపడుతూ ఇలా మరో రెండు రోజులో, రెండు నెలలో అనుకుంటూ బతికే కంటే అలా బతక్క

పోవడమే మంచిది. ఆమెకు ఉపశాంతి కలిగించేది చావే అని ఆ మనిషి నిర్ణయించుకున్నాక ఆమెను ఆమె కోరికమేర చంపకపోవడమే పాపం!

హత్య నేరం.... కానీ, మెర్సీ కిల్లింగ్ నేరం కాదు.

ఇక్కడా రాజమ్మ బిడ్డలు స్వార్థపరులే! తల్లిని చంపి పాపం మూటకట్టుకోదల్చు కోలేదు వాళ్ళు. తల్లిని చంపి హంతకులు, నేరస్థులు కాదల్చుకోలేదు. అందుకే ఆమె అనారోగ్య జీవితం, అనాదరణ జీవనం... ఒకరిమీద ఆధారపడుతూ తనకే రోతగా వున్న ఆమె జీర్ణ శరీరం... దారి కనపడితే... ఎలా అయినా చావాలనే ఆమె మనసులోని కోరిక... ఇవన్నీ ఆ విరిగిపోయిన మంచం మీద... తడిచిపోయి వాసన కొడుతున్న పరుపుమీద.... ఊపిరి పోసుకుంటూనే వున్నాయి ఇంకా... ఇంకా...

ఆమెకు ఈ అనవసర బాధలనుండి ఎప్పటికో విముక్తి?